# వెలుగుబాట

అలసటగా కుర్చీలో వెనక్కి వ్రాలి కళ్ళు మూసుకొన్న డాక్టరు కృష్ణవేణి బయట స్ప్రింగ్‌డోరు దగ్గిర అడుగుల చప్పుడికి కళ్ళు తెరిచి అటు చూసింది. తెల్లటి పాంటు క్రింద నల్లటి నిగనిగలాడే బూట్ల జత, పచ్చని పాదాలపైన ఎర్రని చెప్పులు, జరీ అంచు! ఎవరో క్రొత్తజంట కాబోలు!

తలుపుమీద వేలితో తట్టినట్లనగానే కుర్చీలో సర్దుకుని కూర్చుంటూ, "కమిన్" అంది.

తలుపు త్రోసుకుని ముందు ఆమె వెనకనే వచ్చిన అతనిని చూడగానే కృష్ణవేణికి పిడుగు పడినట్లయింది.... మధు! ...

అతను కూడ డాక్టరుని చూసి త్రొట్రుపడి, ఉన్నచోటే కొద్దిక్షణాలు నిల్చిపోయి, ఏంచేయాలో తోచని దిగ్భ్రమతో చూడసాగాడు. ఇద్దర్నీ వింతగా మార్చి మార్చి చూడసాగింద పార్వతి.

ముందుగా కృష్ణవేణి తేరుకుని చూపులు తప్పించి 'కూర్చోండి' అంది. అతను మరలాగ కదిలి కూర్చున్నాడు.

దడదడలాడే హృదయాన్ని, వణుకుతున్న చేతిని అదుపులో పెట్టుకోవాలని వ్యర్థ ప్రయత్నం చేస్తూ, కాగితం కలం తీసుకుని "ఏమిటి

కంప్లెయింట్ ?" అని పార్వతిని అడిగింది. ఆమె కొంచెం సిగ్గుపడి మధు కేసి "మీరు చెప్పం"డన్నట్టు చూసింది.

అంతవరకు యీ లోకంలో లేనట్టు ఏదో ఆలోచిస్తూ, ఎదురుగ్గా గ్లాక్సో బొమ్మ కాలెండరు చూస్తూ కూర్చున్న అతను భార్య స్పర్శకి ఉలిక్కిపడి ఆమె వంక చూసి, సాధ్యమైనంత మామూలుగా "నాలుగో నెల అనుకుంటున్నాం.. నెలరోజులనించి బ్లీడింగ్ అవుతూంది.... యిది వరకు రెండుసార్లు యిలాగే అయి, ఎబార్షన్, అయింది. ఇది మూడో సారి...." అన్నాడు. ఏదో పాఠం అప్ప చెప్పినట్లు.

తలవంచుకొని కేసు హిస్టరీ రాసుకుంటున్న కృష్ణవేణి అతన్ని ఆపి "సరే, మిగతా వివరాలు ఆమె నడిగి తెలుసుకుంటాను అంటూ కుర్చీనెట్టి లేచి పార్వతిని లోపలికి రమ్మని సైగ చేసింది.

పెద్ద తుపానులో చిక్కుకున్నట్లు ఉక్కిరిబిక్కిరి అయింది కృష్ణవేణి. అతను యిక్కడికి ఎలా రాగలిగాడు ? పైన తగిలించిన బోర్డు చూస్తే తనెవరో తెలిసేదిగా ? తెలిసే వచ్చాడా ? ఎంత ధైర్యం ? ఎంత సిగ్గులేని తనం ? తెలిస్తే ఆ తడబాటు ఎందుకు ? ఆమెకేం పాలుపోలేదు. తను మధు భార్య ఆరోగ్యం కోసం కృషి చేయడం అంటే, ఏదో భయంకరమైన వ్యంగ్యం దాగున్నట్టుంది అందులో,

తిరిగి గదిలోకి వచ్చాక "మూడోమాసం నించి గర్భం ఎదగకుండా కృశించింది. వీలయినంత త్వరలో తీసేయాలి ! అతని వంక చూడకుండానే చెప్పింది కృష్ణవేణి.

"మీ కెప్పుడు వీలుంటుందో చెప్పండి ?" అతను కాస్త ఆగి అన్నాడు.

"సారీ ! నాకు వీలవదు. ఇంకెవరి దగ్గిరకయినా తీసుకెళ్ళండి" పొడిగా అంది. అతను మాటలకోసం వెదుక్కుంటూ గోడ మూలకేసి చూశాడు.

"మీరు స్పెషలిస్టు కాబట్టి, కుదర్చగలరన్న ఆశతో వచ్చాను. దయచేసి కాదనకండి."

"నేను స్పెషలిస్టునయినా, నా పరిమితులు నాకున్నాయి. నేను చేయలేని పని చెయ్యమని బలవంత పెట్టకండి."

"మీరు చేయగలరన్న నమ్మకం నాకుంది.... మీరు ప్రయత్నించండి. ఫలితానికి బాధ్యత నాది. రోగం నయం చేయడం డాక్టరుగా మీ విధి. దయ చేసి మీ కర్తవ్యం మీరు నెరవేర్చండి."

కృష్ణవేణి రోషంగా తలెత్తి చూసింది. "నా విధులు, బాధ్యతలు ఇంకొకరు చెప్పక్కర లేకుండానే నాకు తెలుసు.... అందరి, అన్ని రోగాలు నయం చెయ్యమని నన్నిక్కడ యెవరూ జీతం యిచ్చి కూర్చో పెట్టలేదని, నేను చెయ్యననుకొన్నది. చేయకపోవడానికి, నాకు పూర్తిగా హక్కు, అధికారం ఉన్నాయని, చదువుకొన్న మీకు తెలిసుండాలి.... నన్నింక యెక్కువగా మాట్లాడించకండి."

పార్వతి అయోమయంగా యిద్దరి వంకా చూసి, లేచింది.

"యిదే మీ ఆఖరి నిర్ణయమా ?" నిలబడుతూ అడిగాడు అతను.

కృష్ణవేణి తలదించుకుని మాటలాడలేదు.

"కృష్ణవేణీ! ప్లీజ్, బాగా ఆలోచించు, వ్యక్తిగతమైన అభి ప్రాయాలు ఎలావున్నా ఒక డాక్టరుగా నీ బాధ్యత గుర్తుంచుకో."

"దయచేసి, వెంటనే వెళ్ళండి" విసురుగా, తీవ్రంగా అంది. మరో క్షణం నిలబడితే ఆమె కన్నీళ్ళు చూడవలసి వస్తుందన్న అనుమానం తగలగానే బయటికి వెళ్ళిపోయాడతను.

ఉస్సురుమంటూ అలా కుర్చీలో వెనక్కి వాలిపోయింది కృష్ణవేణి. ఏ ఆలోచనా తోచని శూన్యంలో మెదడు నిండినట్టుయింది. చేతుల్లో తల యిరికించి కాసేపు కూర్చుని, యింక కూర్చోలేక, నర్సుని పిలిచి చూస్తుండ మని చెప్పి యింట్లోకి నడిచింది.

బీరువా తెరిచి, తను పదిలంగా భద్రపరుచుకున్న ఉత్తరం ఒకటి బయటికిలాగి

"నా వేణూ,

ఉత్తరం రాయాలన్న ఆరాటంతో కాగితం, కలం తీశానుగాని, ఏం రాయను? ఎలా రాయను? నా ప్రపంచం అంతా నిండిన నిన్ను ఉత్తి గీతల కూర్పులనిపించే, యీ మాటలు ఎన్నని రాసి వ్యక్తం చేయను? ఎన్నోమాటలు గుర్తుకొస్తాయి. కాని నా మెదడ్ని క్షణం విశ్రాంతి యివ్వకుండా నమిలే అనుభూతులన్నీ చెప్పాలంటే. క్రొత్త మాటలు పుట్టాలనిపిస్తుంది! ఏదో ఆవేదనగా వెతుకతాను. యింకా మంచివి, యింకా ఉన్నతమైనవి దొరకాలని! చివరికి ఏదో రాసి తృప్తిపడక ఏమిటో యీ బాధ అనుకుంటాను!

కృష్ణా! నీకూ అలాగే వుంటుందా? రాత్రి వెన్నెల్లో చల్లగాలి మల్లెల గుబాళింపు అందిస్తూంటే, మన యీ ఒంటరితనంలోని దైన్యాన్ని ఎవరో నిర్దయగా గుర్తుచేసి ఆడుకుంటున్నట్టు నీకూ అనిపిస్తుందా? ఏమో! యీ బాధలు నీకు లేవేమో! యీ వేదన అంతా నాకేనేమో!

ఒకోసారి నా తీయని ఊహల్లో నీ రూపం ఎలా మెదుల్తుందో తెలుసా? తెల్లగా వెలిగే మబ్బుల చాందినీ క్రింద, డాబామీద నువ్వు, కనురెప్పల చాటున వెన్నెల దాచుకొని, నిశ్చింతగా నిద్రపోతూంటావు. అణగక ఎదురు తిరిగే నీ ముంగురుల్తో చల్లగాలి ఆడుకుంటుంది. తీయని ఊహాలో తేలే సన్నని నవ్వులో విడిన పెదాల్ని తేలిగ్గా ముద్దు పెట్టుకుంటుంది! ఏదో చెప్పలేని బాధతో నలిగిపోతాను నేను!

మూడు నెలలకోసారి యీ శలవులు లేకపోతేనేం. లేకపోతే నీ సాన్నిధ్యంలో నీ స్వర్గాల అంచుల్లో తేలిపోయేవాణ్ణి! ప్రస్తుతం అన్నీ వుండి, ఏమి లేని బికారిని నేను! నాయీ దీనస్థితి మీద జాలిపడి, నువ్వోక నాలుగు మాటలు రాస్తే, నేనెంతో అదృష్టవంతుడినని మురిసిపోతాను.

రాస్తావు గదూ!

నీ

మధు.

ఆ ఉత్తరం అప్పటికెన్ని వందలసార్లు చదివిందో! అది మొదటి సారి చదివినపుడు కలిగిన తీయని అనుభూతి మాటల కతీతం. అందుకే ఎన్నేళ్ళయినా, ఆ ఉత్తరం యింతవరకు భద్రంగా దాచుకుంది. అది రాసిన మనిషి కనుమరుగయినా, ఆ మాటలు తల్చుకున్నప్పుడల్లా గిలిగింతలు పెడతాయి.

విసురుగా ఆ నీలిరంగు కాగితాన్ని ముక్కలు ముక్కలుగా చింపేసి కిటికి బయటికి విసిరింది కృష్ణవేణి. ఆ ముక్కలన్నీ పురుగుల్లా ఎగిరి పోయాయి. వాటి వంక అలాగే చూసి, ఆపుకోలేని ఆవేదనతో మంచంమీద పడి తలగడలో మొగం దాచుకుంది కృష్ణవేణి. మనసు కళ్ళెంలేని గుర్రంలా ఎటో పరుగెడ్తూంది. వద్దనుకున్నా, ఎన్నో సంఘటనలు, మాటలు కళ్లెదుట మెదుల్తున్నాయి.

మెడిసన్‌లో చేరేముందు, అసలు మెడిసన్ చదివే ఉద్దేశంలేని కృష్ణవేణి యూనివర్శిటీలో ఆనర్సు చదివేది. ఎప్పుడూ ఎవరితో మాట్లాడకుండా, చదువు తప్పించి మరే వ్యాపకం ఎరగని మధు ఆమె నాకర్షించేడు. కావాలని అతనని పరిచయం చేసుకుంది పరిచయం చేసుకున్నాక, పరువు మర్యాదలు, సభ్యత సంస్కృతి ఉట్టిపడే అతని నడవడి, మాటలు ఆమెని మరింతగా సన్నిహితం చేశాయి. చదువులో అందరికంటె ముందువుండి, అందరిమన్నన, గౌరవం పొందినా, ఎంతో వినయంగా నెమ్మదిగా నడుచుకునే అతని మంచితనానికి ఆకర్షితురాలైంది. అతన్ని తలుచుకు

ఏవేవో కలలుగంది. ఏడాది తిరిగేసరికి ఇద్దరూ అతి సన్నిహితులై ఒకరి పట్ల ఒకరు అభిమానం, అనురాగం పెంచుకున్నారు. ఎన్నో కలలుగన్నారు! ఎన్నో ఊహించుకున్నారు భావిని గురించి!....కాని,....

ఆనర్సయి యింటికి వెళ్ళిన తర్వాత ఒక్కనెలవరకే అతన్నించి తను వింది ఆ తర్వాత ఏమైందీ, ఎక్కడున్నదీ ఏమి తెలుసుకోలేక పోయింది. ఎంతో వ్యధతో, ఆవేదనతో అందరిని అడిగింది. స్వయంగా ఉత్తరాలు రాసింది ఆ నిర్లక్ష్యానికి తట్టుకోలేక ఆమె మనసు గాయపడింది.

తర్వాత ఎవరో చెప్పారు. అతను పెళ్ళి చేసుకున్నాడని, ఏదో ఉద్యోగం చేస్తూ హాయిగా వున్నాడని!

ఎంత పెద్దయెత్తున ఆశల కోటలు కట్టుకుంటే, అవి కూలిపోయాక అంత ఎక్కువగాను బాధపడాల్సి వస్తుంది. ఆమె పనీ అంతే అయింది. అతని వినయం, మంచితనం, మరోవిధంగా, అతని మెత్తదనం, అనుకున్న దానికి కట్టుబడి పరిస్థితుల కెదురీద లేకపోవడం లాంటి బలహీనతలని తెలుసుకోలేకపోయింది! ఫలితం, ఆ లోతైన గాయం యింతవరకు మాన లేదు. మాన్చుకోడానికి ప్రయత్నమూ చేయలేదు. ఒకప్పుడు తన జీవితాన్ని వెలిగించిన అన్నిరంగులూ కడుగుకుపోయి, అచేతనం, నిర్లిప్తం అయిన స్తబ్ధత నిండింది. దీనికి విరుగుడు తనకి తెలియదు. చదువులో గతం మరవ డానికి మెడిసన్‌లో చేరింది. డాక్టరై యధోచితంగా ప్రజాసేవ చేస్తుంది. దేన్నోనూ ఆమెకు మనశ్శాంతి దొరకలేదు. కావాల్సినంత ధనం, పేరు ప్రతిష్ఠలు. దేనికీ కొదవలేకపోయినా ఏదో అసంతృప్తి.

తల్లి రోజుకి అధమం ఒకసారైనా బ్రతిమాలుతుంది. పెళ్ళిచేసుకో మని! తనని యీ వృధ్ధాప్యంలో కష్టపెట్టవద్దని కన్నీరు పెట్టుకుంటుంది. 'నిన్నింతవరకు చదివించడం నాదే తప్పు. ఏదో సరదా పడుతున్నావని ఒప్పుకోడం నాదే బుద్ధితక్కువ' అని నిష్ఠూరం ఆడుతుంది....కాని పెళ్ళాడి యీ నిర్లిప్తత మరొకరికి పంచాలా? అన్న బాధ తనని మూగదాన్ని

చేస్తుంది. యీ శూన్యతలోనే ఏదో తృప్తి, ఆనందం ఉన్నాయనిపిస్తుంది. ఒక బలహీనుడి ఆశ కతకి బలిగా తనని తాను అర్పించుకోడంలో ఏదో విధంగా తన పగతీరినట్టు ఒక సంతృప్తి!

*   *   *

పన్నెండు గంటల వేళ, పేషెంట్లు దాడి తగ్గాక, తీరుబడిగా మెడికల్ జర్నల్ తిరగేస్తున్న కృష్ణవేణి అడుగుల చప్పుడుకి తలెత్తింది. అతను! కలవరపాటు అణుచుకుని "ఏమిటన్నట్టు?" ప్రశ్నార్థకంగా చూసింది.

"నీతో....మీతో....కొన్ని విషయాలు చెప్పాలని వచ్చాను" అతి ప్రయత్నంమీద అన్నాడు మధు.

"నాకేం వినడానికి ఓపిక, తీరుబడిలేవు. ఏదయినా పేషంటు గురించి అయితే తొందరగా చెప్పండి."

"మీతో వ్యక్తిగతంగా కొంచెంసేపు మాట్లాడాలి" సందేహిస్తూ అన్నాడు అతను.

"నాకు వీలుగాదు. మీరు వెళ్ళచ్చు."

"కృష్ణా! నీ కోపం నా కర్థమవుతుంది. కాని నేను చెప్పేది విన్నాక నువ్వేమన్నా అనుకో. నా బాధ్యత తీర్చుకున్నానన్న తృప్తి నాకు దక్కనీ, కనీసం యీ అవకాశం యియ్యమని ప్రార్థిస్తున్నాను!" జాలిగా అన్నాడు.

"మిష్టర్! ఎవరనుకున్నారు? ఏమిటా అతి చనువు?" రోషంగా అడిగింది కృష్ణవేణి.

జాలిగా, దయనీయంగా చూసే ఆ కళ్ళు మొదటినించీ తనని మాయ చేసిన ఆ అమాయకత ఆమెని తిరిగి వశం చేసుకున్నాయి. కాని....ఆమె ఓడిపోదల్చుకోలేదు.

"ఎందుకింకా నిలబడతారు. మీరు వెళ్ళండి." పుస్తకంలో మొగం దాచుకుని కంపించే కంఠంతో అడిగింది. మరి కొద్ది క్షణాలకి పుస్తకం

పై నించీ చూస్తే అతనక్కడ లేడు. బల్లమీద తల ఆన్చుకుంది కృష్ణవేణి. ఆగకుండా కన్నీళ్ళు ధారకట్టాయి. ఆపుకోవాలని ప్రయత్నము చేయలేదు.

అయిదేళ్ళ తరువాత యీ కలయిక కృష్ణవేణిని అతిగా కదిలించింది.

పనిలో నిరుత్సాహం, అనాసక్తత యెక్కువయ్యాయి. ప్రతి విషయంపైన, ఎదురైన ప్రతి మనిషిపైన, తనపైనే ఏదో విసుగుదల! తనకి తెలియకుండానే వశం చేసుకుంటున్న యీ అవలక్షణాలని తప్పించుకోడానికి ఆమెకి ఒక్కటే మార్గం కనిపించింది.

కొన్నాళ్ళు యీ మనుష్యులకి, పరిసరాలకి, దూరంగా ఎక్కడికన్నా వెడితే ఆ ఒంటరితనంలో ప్రశాంతతలో ఉపశమనం దొరుకుతుందేమో! కాని చాలకాలం యీ ఆలోచన ఆలోచనగానే ఉండిపోయింది.

* * * *

రెండేళ్ళ తరువాత ఆమె, కొన్నిరోజులు విశ్రాంతి కోసం రకరకాల చోట్లు తిరిగింది. పట్నాల కన్న, పల్లెటూర్లలో తనకి కావల్సిన ప్రశాంతత దొరుకుతుందన్న ఆశతో దూర దూరపు బంధువులందర్ని గుర్తు చేసుకుని చిన్నచిన్న గ్రామాలన్నీ తిరిగింది. ఎక్కడన్నా వాతావరణం తనకి నచ్చితే, అక్కడే స్థిరపడాలని ఆమె సంకల్పం.

అది మరీ పల్లెటూరు. కాలిబాట తప్పించి మరే దారీలేదు ఆ ఊరు చేరడానికి, లేదంటే పడవలో ప్రయాణం చేయాలి. ఆ ఊర్లో దగ్గిర బంధువు లుండడమే కాకుండా, తన చిన్ననాటి స్నేహితురాలు శ్యామల ఉంది.

ఒక సాయంకాలం శ్యామల బలవంతాన, ఆ ఊరు చేరిన రెండు రోజులకి, గుడిలో భగవద్గీత ఉపన్యాసానికి వెళ్ళింది కృష్ణవేణి. ఆమెకి వేదాంతం వినాలని ఉత్సాహంలేదు. తీరా అక్కడికి వెళ్ళి చూశాక తన కళ్ళు తను నమ్మలేకపోయింది.... మధు!!

కాషాయబట్టలు, గుండ్రని తల, నిర్లిప్తంగా ప్రశాంతంగా చూసేకళ్లు ఆ ఆకారం మొదట గుర్తు పట్టలేకపోయింది. కాని ఆ మొగంలోని సౌమ్యం, ఆ గొంతులో వినయం, సాత్వికం ఆమెకి బాగా పరిచయం. చాలసేపు ఏం తోచని స్థితిలో కూలబడిపోయింది. ఉపన్యాసం సాగిపోతూంది. ప్రజలు ఆనందిస్తున్నట్టు తలలూపుతున్నారు. ఆమెకి మాత్రం అతను చెప్పే మాటలేవీ తలకెక్కడంలేదు. ఎన్నో ఆలోచనలు ఉప్పెనగా ఆమెని ముంచెత్తాయి. ఉపన్యాసం ముగిసినా ఆ సంగతి ఆమెకి గుర్తులేదు. అందరూ లేచి అతను కూర్చున్న చోటికివెళ్ళి నమస్కరించి వెడుతున్నారు.

"చాల బాగుంది కాదూ! అద్భుతమైన శైలి! ఎంత వేదాంతమైనా విసుగెత్తకుండా వినబుద్ధి వేస్తుంది. చిన్న పిల్లలకి కూడ బోధపడే అంత బాగా చెపుతారు.... తిండి తిప్పలు కరవై పొట్టపోసుకోడానికి సన్యాసం పుచ్చుకున్న దొంగసన్యాసి కాదాయన. ఆయన చరిత్ర వింటే ఆశ్చర్య పడతావేమో! ఎం. ఏ. ప్యాసయ్యారు. మంచి ఉద్యోగం, బోలెడు పొలాలు, యిల్లు—అన్నీ వదులుకున్నారు. ఎందుకో ఆయనకి విరక్తి కలిగింది. రామకృష్ణ మిషన్లో చేరారు. ఆస్తి అంతా మిషన్‌కే రాసిచ్చారు....

"గోదావరి వడ్డున పూరిపాకలో మకాం. చిన్నపిల్లలకి పాఠాలు చెపుతారు. పెద్దలకి పురాణగ్రంథాలు, వేదాంతగ్రంథాలు చదివి చెపుతారు. అందుకు ప్రతిగా ఊర్లోవాళ్ళు వంతులు వేసుకుని రోజు ఆయనక్కావలసిన పళ్ళు పాలు పంపుతారు. ఆయినంతట ఆయన ఎవరినీ దేనికి యాచించరు. వీళ్ళు పంపినవి ఆయనకి ఎక్కువైతే పేదలకు పంచిపెడుతారు.... సంవత్సరానికి ఒకవూరు చొప్పున తిరుగుతున్నారు. ఇక్కడికివచ్చి ఆర్నెల్లయింది."

దారి పొడుగునా శ్యామల స్వామివారి గురించి చెప్తూనే ఉంది. కృష్ణవేణికి ఆకాశం, నేల, పైకి క్రిందికీ గుండ్రంగా తిరిగి స్థలాలు మార్చుకుంటున్నట్టుంది.

ఏమయింది, మధుకి, జీవితంమీద అంత విరక్తి పుట్టడానికి! తనలో పెల్లుబుకుతున్న ఉద్రేకాన్ని అణుచుకుంటూ "నేనాయనతో మాట్లాడాలి!" అంది కృష్ణవేణి.

"మాట్లాడ లేకపోయావా? యింతకన్న మంచి సమయం ఎప్పుడు దొరుకుతుంది? మిగత సమయాల్లో ఆయన చదువు చెపుతోనో, ధ్యానంతోనో ఉంటారు. ఆ సమయాల్లో ఆయన సాధారణంగా ఎవరితోనో మాట్లాడరు!" నడుస్తున్నదల్లా ఆగింది శ్యామల.

అంతమందిలో ఏం మాట్లాడుతుంది? ఎలా?

"వద్దులే, యిప్పుడుగాదు!" యింటికి వచ్చేసింది కృష్ణవేణి.

ఒకరు మనకి చేసిన అన్యాయానికి ప్రతిగా మనకి మనం శిక్ష వేసుకుని సత్యాగ్రహం చెయ్యడంలో ఒకరకంగా పగతీర్చుకున్నామన్న తృప్తి కలుగుతుంది. తను పెళ్ళి చేసుకోకుండా త్యాగంచేసి ఒక విధంగా తన కసి తీర్చుకోగలిగిందనీ, అతన్ని సాధించగలిగిందనీ అనుకుంది. కాని ఆమె అంచనాలన్నీ తారుమారయ్యాయన్న సత్యం ఎదుట నిలవగానే ఆమెకి దిక్కు తోచనట్లయింది. యిక ముందేమిటి చెయ్యాలి? తను ఒక్క సంసార సుఖాన్నే వదులుకుంటే, అతను మొత్తం అన్నీ వదులుకున్నాడు!

ఆ మర్నాడుదయం, ఒంటరిగా అతనున్న చోటికి నడచి వెళ్ళింది కృష్ణవేణి.

ఒకటే రాటమీద వేసిన చిన్నపాక. పక్కల్ని గోడల్లాంటివేం లేవు. చూరు క్రిందకంటా దిగింది. నేల నెరియలు తీసి గట్టిపడింది. కొబ్బరి ఆకుల్తో అల్లిన చాపల్లాంటివి రెండుమూడు, ఒక కుండ, మూకుడు, మట్టి చెంబు, ఒకటో రెండో ఆరవేసిన కాషాయ గుడ్డలు, ఒక కర్రచెక్కమీద పదో పన్నెండు పుస్తకాలు. అవీ అతని ఆస్థి!

ఆమె వెళ్ళేసరికి అతను నేలమీద మఠంవేసి కూర్చుని ఏదో పుస్తకం చదువుతున్నాడు. ఆమె పాక ముందు నిలబడి లోపలంతా కలయ చూసింది. కన్నీళ్ళు పెల్లుబికాయి.

"ఎవరు?....కృష్ణా! ఇవాళ ఎంత సుదినం?" నవ్వాడతను, కూర్చున్న చోటునించి కదలకుండానే.

ఆమె అలాగే నిలబడింది.

"నీ కభ్యంతరం లేకపోతే లోపలికి రావచ్చు.... కాని... నిన్ను కూర్చోపెట్టడానికి యీ చాపలు తప్పించి ఏంలేవు ?" లేచి ఓ చాప ముందుకు వేశాడు. అతని గొంతులో ఏ తడబాటు, ఆందోళనలేదు. ఆనందం, విచారం, సంతోషం, బాధ లాంటివేవి ఎరగని ప్రశాంతత అతని మొగంలో, మాటల్లో మెరుస్తోంది.

మౌనంగా కదిలి కూర్చుంది కృష్ణవేణి. ఆమె అంతవరకు వేసుకున్న చెలియలి కట్ట తెగిపోతూంటే, మోకాళ్ళ మధ్య తల యిరికించి కన్నీళ్ళు దాచుకుంది.

"ఎందుకేడుస్తావు వేణూ ! ఏమిటి నీ బాధ ? నాతో చెప్పకూడదా?" అదే గొంతు ! ఏ కదలిక, సంచలనంలేని ఆ ధోరణికి ఆమె తట్టుకోలేక పోయింది.

"మధూ, ఏమిటిదంతా ?" ఒకసారి విసురుగా తలెత్తి గట్టిగా అడిగింది. కళ్ళు జ్యోతుల్లా ఎర్రగా వున్నాయి.

"నీకు తోచినట్టు నువ్వు పిలవచ్చుగాని, నా పేరదిగాదు యిప్పుడు."

"ఏమిటిది ?"

"ఏమయింది ?" అదే చిరునవ్వు ! !

"ఎందుకు నన్ను చిత్రవధ చేస్తావు యీ మాటల్తో ? నన్ను కాలుస్తున్న అనుభూతులు నీలో కలగడంలేదా ? ఎందుకిలా రాయైపోయావు? యిలా యెందుకు మారాల్సి వచ్చింది ? ఎవరు మారమన్నారు ? ఎవరికి శిక్ష యిది ?".... ఆవేశంతో అడిగింది కృష్ణవేణి.

అతను మాట్లాడలేదు. మొగంలో మార్పులేదు. కళ్ళు నిశ్చలంగా దూరంగా చూశాయి.

"మధూ, నన్ను మోసం చెయ్యకు ! నీ మనసులో రేగుతున్న తుఫానుల్ని బలవంతాన ప్రశాంతత ముసుగు కప్పి అణచాలని చూడకు ! నిన్ను ప్రార్థిస్తున్నాను.... ఎందుకు, ఎందుకిలా అయావు ?"

అతను పొడుగ్గా ఊపిరి తీసి మరొకసారి నవ్వాడు. ఆ నవ్వు చాల లోతుగా ఆమెని తాకి చకితురాలిని చేసింది.

కథా నిలయం 2968 శ్రీకాకుళం

"ఎందుకంత ఆవేశం కృష్ణా! నీకంత వినాలని కుతూహలంగా ఉంటే, దాచాలని నాకూలేదు. అలా బయటికిరా, ఆరుబయట గోదావరిఒడ్డున కూర్చుంటే బాగుంటుంది" అతను లేచి ముందు నడిచాడు. ఆమె అనుసరించింది.

దర్భగడ్డి దుబ్బుల్లోంచి క్రిందికి యిసకలోకి దారితీశాడు. యిసకలో పేళ్ళలాగ నీటిపాయలు రెండుమూడు అంగుళాల లోతున పారుతున్నాయి. స్వచ్ఛమైన నీటి జాలు క్రింద రంగురంగుల గులకరాళ్ళు మెరుస్తున్నాయి. యెదురుగ్గా లంకల్లో జొన్నచేలు, మంచె; యిటుప్రక్క ఒడ్డున తెల్లగా కాలిన నేల. అక్కడక్కడ ఎత్తయిన దిబ్బలు, శ్మశానాన్ని గుర్తు చేస్తున్నాయి. కొంచెందూరంలో ఆకులన్నీ రాల్చిన మోడు కొమ్మలతో పెద్ద రావిచెట్టు. ఎర్రటి ఇటుకలమీద మొల్చిన మొక్కల్తో పాడుబడ్డ శివాలయం, దూరంగా అవతలి పాయలో నీలంగా గోదావరి. చుట్టుప్రక్కల ఎవరూ లేరు, రెండుమూడు ఫర్లాంగులు దూరాన పశువుల్ని మేతకోసం లంకల్లోకి తీసుకెళ్తున్న పాలేర్ల పదాలు, కొంగలు, గరుడపక్షులు చేసే కూతలు తప్పి యింకేం శబ్దంలేదు.

ఒక నీటి జాలు ప్రక్కగా యిసకలో కూర్చున్నారిద్దరూ.

"యిప్పుడు కురిపించు నీ ప్రశ్నలు!" నవ్వుతూ అన్నాడు.

"పార్వతి ఏమయింది?"

"చనిపోయింది, ప్రసవించలేక."

చనిపోయింది తన భార్య కానట్టు అతనంత మామూలుగా చెప్తే, ఆ నిర్లిప్తతతో విషాదం ఆమె భరించలేక మూగబోయింది చాలసేపు. ఏదో పెద్ద నేరం చేసినట్టు, ఆమెని తనే హత్య చేసినట్టు అనిపించింది. అతనంతట అతనే యింకా ఎన్నో చెప్తాడని ఆశించిన ఆమె, అతని మౌనాన్ని భంగపరుస్తూ విధిలేక అడిగింది.

"అప్పుడు....నన్నంత సులభంగా ఎలా మర్చిపోగలిగారు?"

"మర్చిపోయానా?....నిన్నా, లేదే! అప్పుడు పరిస్థితులలా వచ్చాయి.

ఆనర్సు పూర్తయి యింటికి వెళ్ళగానే నాన్న పెళ్ళి సంగతి తెచ్చారు" ఆమె ప్రశ్న నర్థం చేసుకున్నట్టు అతను చెప్పడం మొదలు పెట్టాడు.

"కృష్ణా, చిన్నప్పటినించి, నేను దురదృష్టవంతుడినే! నేను పుట్టగానే అమ్మపోయింది. అమ్మని అతిగా ప్రేమించే నాన్నకి నేను పుట్టగానే అమ్మ పోవడం నా మీద ఆయన కొక విధమైన నిర్దయకు కారణం అయింది. నన్ను చూడ్డమే మహాపాపం అన్నట్లుండేవారు. ఆయా దయాధర్మాల మీద ఏ ఆలానా, పాలనా, ముద్దుముచ్చటా లేకుండానే గాలికి అయిదేళ్లు పెరిగాను. ఇంట్లో అక్క, అన్నలు అందరూ నన్ను వెలేసినట్లుండేవారు. అందుకే చిన్నప్పటినించి కూడ నాకు ఎవరితో కలవకుండా, ముభావంగా వుండడం అలవాటయింది. నాకు అయిదేళ్ళప్పుడు, అత్తయ్య, తన రెండేళ్ళ కూతురు పార్వతిని వెంట పెట్టుకుని, భర్తపోగా మా యింటికి చేరింది. అంతవరకు నాకు కరవైన ప్రేమాభిమానాలు చూపెట్టింది. తన కూతురుతో సమానంగా పెంచింది. అత్తయ్య బోధలవల్ల నాన్న ధోరణి కొంత మారింది. పది హేనేళ్ళు ఆమె చేతిలో పెరిగాను. చిన్నప్పటినించి ఇంటా, బయట పార్వతి, నేను భార్యాభర్తలమనే భావంతో అందరూ మాటలాడేవారు. అయినా నేను ఎప్పుడూ ఆ భావంతో ఆలోచించలేదు పార్వతిని గురించి. అలాగని విముఖతా వుండేదికాదు.

నాన్నగారు, పార్వతితో నా పెళ్ళి మాటెత్తగానే, నేను మాట్లాడ లేదు. ఆయన వెంటనే రెచ్చిపోయారు. మన సంగతి ఆయనకి ఎలాగో తెలిసింది. ఎలాగో తెలిసింది. ఎలాగో తెలిసింది కదా అని నేను మన సంగతి చెప్పి, మన నిర్ణయం చెప్పగానే, నాన్నగారి ఆగ్రహావేశాలకి అంతులేక పోయింది. అత్తయ్య అడ్డుపడి తీసుకెళ్ళి, బ్రతిమిలాడింది, నచ్చచెప్పబోయింది, కన్నీరు పెట్టుకుంది. "చిన్నప్పటి నించి అనుకున్నది. యిప్పుడిలా చేస్తే యింక పార్వతి గతేమిటి?" అని ప్రాధేయ పడింది. నిష్ఠూర్యాలాడింది.... అయినా నేను వినలేదు.

"పార్వతి అందంగా వుంటుందా, వుండదా అని నేను ఆలోచించ లేదు. అందుకు నువ్వు కారణం! కాని....

పెద్దగా వివరణలు అనవసరం. ఆ తర్వాత పది రోజులు యింట్లో ఎంత రభస జరగాలో అంత జరిగింది. అత్తయ్య పస్తులు పడుకుంది. నాన్నగారు అనేకరకాల బెదిరించారు. ఆఖరి అస్త్రంగా పార్వతిని పంపారు. పార్వతి కన్నీరుకి కూడా నేను కరుగలేదు.

ఏదో బ్రతకడం కోసం అన్నాళ్ళు బ్రతికిన నేను....నీ స్నేహంతో, నీ మాటలతో, నీ సహచర్యంతో క్రొత్త జీవితాన్ని... జీవితంలో ఆనందాలని వెలుగుని రుచి చూసిన నేను, ఏమయినా నిన్నంత సులభంగా వదులుకో డానికి యిష్టపడలేదు. దేన్నయినా ఎదుర్కోడా కి సిద్ధపడ్డాను నీ కోసం!

"కాని....చివరికి ఒక రాత్రి....అర్ధరాత్రి! పార్వతి నూతిలో పడింది! నా కోసం ఒకరు నిండు ప్రాణం తీసుకోడానికి సిద్ధపడిందంటే, ఆ పని మూర్ఖత్వమే అయినా, నేను తట్టుకోలేక పోయాను. ఇంటా బయట నేనో హంతకుడినన్నట్టు చూస్తూంటే భరించలేక పోయాను. అందరూ ఏమన్నారో, ఏం చేశారో, ఎలా నా చేత 'ఊ' అనిపించారో నేను తెలుసు కునే లోపలే, హడావిడిగా, మళ్ళీ మనసు మార్చుకోకుండా, పదిరోజుల్లో దైవసన్నిధిని పార్వతిని నా భార్యగా చేసేసారు.

"పెళ్ళయ్యాక, నేను ఒక ఏడాది అసలు పార్వతిని కన్నెత్తి కూడ చూడలేదు. కాని నా మూర్ఖత్వానికి బలై పార్వతి కృశించి పోవడం ఎంతో కాలం సహించలేక పోయాను. నాన్న, అత్తయ్య వాళ్ళ కోరిక నెర వేర్చుకుని తృప్తిగా చనిపోయారు.

"కృష్ణా, నా బలహీనతకి, నిన్ను దూరం చేసుకుని నేను ఎంత బాధ పడ్డానో నీకు తెలియదు! నా అశక్తతకి నిన్ను బలిపెట్టిన నేను పడ్డ ఆవేదన నీకు అర్థం అవదు. క్షమించమని అడిగే ధైర్యం కూడ లేక, నీకు ఎన్నో సార్లు ఉత్తరం రాయడానికి పూనుకొని కూడ చూసుకున్నాను. ఏ సంగతి తెలియక, నీవు పడే ఆరాటం తెలిసినా, సంగతి తెలిపే ధైర్యం లేక పోయింది.

పార్వతిని నీ దగ్గరకు తీసుకు వచ్చినప్పుడు, అసలు నీవని తెలియదు. తీరా చూశాక, నీవు నాపట్ల ఎంత ఏహ్యం పెంచుకున్నావో చూసి, అప్పు డయినా, నా నిర్దోషిత్వం తెలుపుకుని క్షమాపణ కోరుకుందామంటే నీవు, నాకా అవకాశం యీయలేదు.

పార్వతిలో తల్లి నవాలనే కాంక్ష వుండేది.... కాని ఆమెలో ఏదో సరిగాలేదని, మరోసారి గర్భం ధరిస్తే, ప్రమాదం అని మూడోసారి డాక్టర్లు హెచ్చరించినా, పిల్లలమీద మమకారం అణుచుకోలేక, ఎంత చెప్పినా, వినక ప్రాణం పోగొట్టుకుంది. పాపం ... పార్వతి తల్లి నవ్వాలన్న కాంక్ష తీరకుండానే కన్నుమూసింది. అదే నాకు బాధగా వుంది....

మొదట నిన్ను.... తరువాత పార్వతిని పోగొట్టుకున్నాక, యింక నాకు భగవంతు డొక్కడే మిగిలాడు...."

అతని మొగంలో ఒకరకమైన తీవ్రత, గంభీర్యం కనపడ్డాయి. కృష్ణవేణి చాలసేపు మాట్లాడలేదు. ఆమెకెన్నో క్రొత్త విషయాలు తెలిశాయి ఒక్కసారిగా.

"నిన్న సాయంకాలం నన్ను చూశారా?" మెల్లిగా అడిగింది.

"చూశాను." అతని మొగంలో తీవ్రతపోయి, మళ్ళా ప్రశాంతమైన చిరునవ్వు విరిసింది. యింకేమన్నా చెప్తాడేమోనని ఆశించింది. కాని అత నింకేం మాట్లాడలేదు.

మరో ప్రశ్న అడగాలనుకుంది కృష్ణవేణి. కాని అడగడానికి ధైర్యం చాలలేదు. అతనిచ్చే జవాబు ఆమెకి తెలిసినట్టనిపించింది. ఆ జవాబు అతని నోట వినడం ఆమె భరించలేదు.

లేత ఎండ నీటిజాలుమీద జలతారు మెరుగులు దిద్దుతూంటే, తడయిన కళ్ళతో అతనికి చేతులు జోడించింది కృష్ణవేణి. ఆమెకో వెలుగు బాట కనిపించింది.

(ఆంధ్ర సచిత్రవారపత్రిక నుండి గ్రహింపబడినది)